సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం | 28 | ఏప్రిల్ | 2023



కమనీయం..
త్రిశూల చక్రస్నానం
పుష్పగిరిలో శ్రీకామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి. శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వాముల బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. -8లో..



కుక్క మొరిగిందని.. దాడి
మల్లెల గ్రామంలో కుక్క మొరిగిందనే కారణంతో ఇద్దరు యువకులు దంపతులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.92
రెండోరకం	రూ.50	రూ.72



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 439 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	511	549
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 448.52 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

రాయచోటి: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ గిరీషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నెల్లూరు నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు రైల్వేకోడూరుకు చేరుకుంటారు. అక్కడ నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్‌ఆర్ అగ్రి ల్యాబ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. మధ్యాహ్నం 12 గంటలకు రైల్వేకోడూరు నుంచి బయలుదేరి 12: 30కు అనంతరాజుపేటకు చేరుకుంటారు. అనంతరాజుపేట ఉద్యానవన విశ్వవిద్యాలయంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు అనంతరాజుపేట నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి నెల్లూరు జిల్లా పొదలకూరుకు మంత్రి బయలుదేరి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి: అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలకు రూ. లక్ష వంతున ఆర్థిక సాయాన్ని అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు చేతుల మీదుగా అందజేశారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులు చెక్కులు అందుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహించిన జి సుబ్బరాయుడు, రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్ పెద్ద రెడ్డయ్య రాజులు అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలకు పోలీసు సంక్షేమం నుంచి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో ఎస్పీ ఇచ్చారు.

హెల్మెట్ ధరించాలి



షార్ట్ ఫిల్మ్ లోగోను ఆవిష్కరిస్తున్న అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్ తదితరులు

రాయచోటి అర్బన్: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో వీఆర్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో పాత గొల్లపల్లెకు చెందిన యువకులు ఇంటికి వెలుగు ఆడబిడ్డ.. బైకుకు వెలుగు హెల్మెట్ అనే షార్ట్ ఫిల్మ్‌ను తీశారు. దీనికి సంబంధించిన లోగోను అడిషనల్ ఎస్పీ ఆవిష్కరించారు. ద్విచక్రవాన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని చెప్పారు. వాహనాల్లో ప్రయాణం చేసే సమయంలో లక్ష్య కంటే ముందుగా మన ఇళ్లు గుర్తు రావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి అన్నారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర రెడ్డి, వీఆర్‌డీఎస్ చైర్మన్ సురేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ, షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ గంగాప్రసాద్, నటులు యోగి,,నాగార్జున,శ్రీనులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి



నీలకంఠ్రావుపేట గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ధనలక్ష్మి

రామాపురం: ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి ధనలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామ పంచాయితీ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు.తర్వాత నీలకంఠ్రావుపేట స్కూల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, పద్మజ, సర్పంచ్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకాలు

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జిల్లా పోలీసు కంప్లెయింట్ అథారిటీ సభ్యుల నియామకాన్ని చేపట్టారు. కడప, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు సంబంధించి పోలీసు కంప్లెయింట్ అథారిటీ సభ్యులను ఒక బృందంగా ఏర్పాటు చేశారు. ఈ బృందంలో కర్నూలుకు చెందిన రిటైర్డ్ డీఎస్పీ కేవీ రాఘవరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సారెడ్డి శశిదేవి, ప్రొద్దుటూరు న్యాయవాది కాకర్ల నాగేశ్వరెడ్డిలను నియమించారు.

విరబూసిన విద్యా కుసుమాలు

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మార్కుల పంట



కవిత



ప్రీతిలతాదాల్



తల్లిదండ్రులతో మెహర్



తల్లిదండ్రులతో ప్రీతిలతాదాల్

మదనపల్లె సిటీ: కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఇంటర్మీడియట్‌లో పేద, సామాన్య కుటుంబాల పిల్లలు సగర్వంగా తలెత్తుకునే రీతిలో మార్కులు సాధించారు. ఒకప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో చదివే పిల్లలు పాసైతే చాలు అనుకునేవారు. నేడు ఆ పరిస్థితి మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించి, మౌలిక వసతులు కల్పించడంతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి అందరి మన్ననలు పొందారు.

కార్మికుడి ఇంట.. చదువుల తల్లి

మదనపల్లె పట్టణం అవంతి టాకీసు వద్ద నివాసం ఉంటున్న ఖాదర్‌వలి మెకానిక్. షర్మిల గృహిణి. సామాన్య కుటుంబం. కూతురు మెహర్ చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తోంది. పదో తరగతి స్థానిక హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివింది. పదిలో 590 మార్కులు సాధించింది. ఇంటర్మీడియట్ బాలికల జూనియర్ కాలేజీలో బైపిసి చేరింది. ఇంటర్‌లో 968 మార్కులు వచ్చాయి.

రైతు బిడ్డ ..చదువులో దిట్ట

రైతు కుటుంబంలో పుట్టి చదువులో రాణిస్తోంది.సత్యసాయి జిల్లా కొక్కంటిక్రాస్ నల్లంవారిపల్లెకు చెందిన లింగారెడ్డి పద్మావతిల కుమార్తె కవిత. లింగారెడ్డి రైతు, పద్మావతి గృహిణి. కవిత మదనపల్లె జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి పాసైంది. ఇంటర్ బాలికల జూనియర్ కాలేజీలో బైపీసీ చేరింది. ఇంటర్‌లో 965 మార్కులు సాధించింది. కాలేజీ హాస్టల్‌లో ఉంటూ విద్యలో రాణించింది.

వాచ్‌మెన్ కూతురు..ఇంటర్‌లో టాపర్

తండ్రి వాచ్‌మెన్. తండ్రి పడుతున్న కష్టాలు చూసి చదువులో రాణించాలనుకుంది ప్రీతిలతాదాల్. మదనపల్లె ఎస్టేట్‌కు చెందిన దిగంబర్‌దాల్ ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. ప్రీతి లతాదాల్ ప్రభుత్వ కళాశాలలో చదివి సీఈసీలో 948 మార్కులు సాధించించి అందరి మన్ననలు అందుకుంది.

బి.ఫార్మసీ చేయాలని ఉంది

ఎంసెట్, నీట్ ఎంట్రన్స్ రాస్తా. బి.ఫార్మసీ చేయాలని ఉంది.అధ్యాపకులు, తల్లిదండ్రుల సలహాలు, సూచనలతో మంచి మార్కులు సాధించా.
-మెహర్, మదనపల్లె

ఎంబీబీఎస్ చేస్తా

ఎంబీబీఎస్ చేయాలని ఉంది. ఇందు కోసం ఎంసెట్,నీట్ ఎంట్రన్స్‌లకు ప్రిపేర్ అవుతున్నా. అధ్యాపకులు ఇచ్చిన సలహాలు, సూచనలతో ప్రతి రోజు 9 గంటలు చదువుతున్నా.
-కవిత

ఐఏఎస్ కావాలన్నదే ధ్యేయం

సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలన్నదే ధ్యేయం. అందుకే ఇంటర్మీడియట్ సీఈసీ చేరాను. అధ్యాపకులు రెడ్డప్ప రెడ్డి సూచనలు,సలహాలతో మంచి మార్కులు సాధించాను.
-ప్రీతిలతాదాల్

దినకూలి ఇంట సరస్వతి పుత్రుడు



తల్లి అమరావతితో విద్యార్థి అశోక్‌కుమార్

తంబళ్లపల్లె: ఓ దినసరి కూలీ ఇంట చదువుల తల్లి సరస్వతి కొలువుదీరింది. ఆ ఇంటిలోని ఓ విద్యార్థి ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభచాటాడు. మండలంలోని కొటాలకు చెందిన అమరావతి కూలీ పనులతో కుటుంబ పోషణ సాగిస్తోంది. రెండో కుమారుడు ఇ.అశోక్‌కుమార్ ప్రాథమిక విద్య కొటాలలో, గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి 540 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. తంబళ్లపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో చేరాడు. ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 950 మార్కులు సాధించాడు. అతడి తండ్రి ఈశ్వరయ్య కోవిడ్ తో మృతి చెందాడు. ఐఏఎస్ కావలన్నదే తన ఆశయమని చెప్పాడు.

సత్తా చాటిన పేదింటి బిడ్డలు



తల్లిదండ్రులతో శివసాయి కార్తీక్, రాజంపేట

టాపర్‌గా నిలిచిన చిరుద్యోగి తనయుడు

రాజంపేట టౌన్: రాజంపేటకు చెందిన ఉప్పలపాటి శివసాయికార్తీక్ ఎంపీసీలో 964 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. తండ్రి సుబ్బరాయుడు ఓ సంస్థలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే చిరుద్యోగి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయి అమ్మానాన్నలను బాగా చూసుకోవాలన్నదే తన కోరిక అని శివసాయి కార్తీక్ చెబుతున్నాడు.

నాన్న తాపీమేస్త్రీ..తనయ చదువులో మేటి



తల్లిదండ్రులతో బెస్లీ

రాజంపేటకు చెందిన బెస్లీ ఎంపీసీ గ్రూపులో 957 మార్కులు సాధించి కళాశాల రెండోటాపర్‌గా నిలిచింది. నాన్న భాస్కర్ తాపీ మేస్త్రీ. అయినప్పటికి పిల్లలను బాగా చదివించాలన్నదే ఆయన కోరిక. తండ్రి కోరిక మేరకు బెస్లీ చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తోంది. ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటింది. పై చదువులు చదివి మంచి ఉద్యోగం సాధించి తన శక్తిమేరకు పేద విద్యార్థులకు సహాయం చేస్తానని చెబుతోంది.

నాన్న నమ్మకాన్ని నిలపెట్టిన రేష్మా

రాజంపేటకు చెందిన రేష్మా ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో 950 మార్కులు సాదించి కళాశాలలో మూడో టాపర్‌గా నిలిచింది. రేష్మా చిన్నప్పటి నుంచి బాగా చదువుతుండటంతో ఆమె తండ్రి ముబారక్ కుమార్తెను కార్పొరేట్ కళాశాలలో చేర్పించి చదివించాలని ఆశపడేవాడు. అయితే సెల్‌ఫోన్లు రిపేరు చేసుకుని జీవించే ముబారక్ పేదరికంతో ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తూ వచ్చాడు. అయితే రేష్మా తన తండ్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించింది. దీంతో ఆమె తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నదే తన లక్ష్యమని రేష్మా చెబుతుంది.



రేష్మాకు స్వీటు తినిపిస్తున్న తండ్రి ముభారక్

తండ్రి ఐస్‌పుల్లర్ అయినా

రాజంపేటకు చెందిన నర్సింగ్ విద్యార్థిని రజియా తండ్రి వీధుల్లో ఐస్ విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రజియా తన తండ్రి పడే కష్టాన్ని చూసి త్వరగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఇంటర్‌లో నర్సింగ్ కోర్సులో చేరింది. ఇంటర్‌లో 940 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఎ



తల్లిదండ్రులతో రజియా

త్వరితగతిన భూ పరిహారం పంపిణీ చేయాలి

అధికారులకు కలెక్టర్ గిరీషా ఆదేశం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారులకు అవార్డు పాస్ చేసిన భూములకు వేగంగా పరిహారం పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్‌హెచ్ 71 కింద మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, కలికిరి మండలాలలో సేకరించిన భూములకు సంబంధించి అవార్డులు పాస్ చేసిన వాటిలో 84శాతం పరిహారం చెల్లింపు చేశారన్నారు. వచ్చే వారంలోగా 90శాతం మేర తప్పనిసరిగా చెల్లింపులు చేయాలని సంబంధిత తహసీల్దార్లు, ఆర్డీఓలను ఆదేశించారు. ఎన్‌హెచ్ 716 కింద కడప నుంచి రేణిగుంట మార్గంలో 72 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న జాతీయ రహదారిలో నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రైల్వేకోడూరు మండలాల్లోని 24 గ్రామాల పరిధిలో ఇప్పటికే సేకరించిన భూములకు సంబంధించి పరిహారం చెల్లింపు అంశంపై కలెక్టర్ సమీక్షించారు.లబ్ధిదారులకు పరిహారం చెల్లించేందుకు తహసీల్దార్లు కృషి చేయాలన్నారు.రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి, ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

- మే నెలాఖరులోగా ఝరికోన, గాలివీడు, రామాపురం, ఎల్ఆర్ పల్లి సప్లై చానల్, లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ పనులను పూర్తి చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
- భగీరథ మహర్షి పట్టుదల మన అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లాకలెక్టర్, డీఆర్‌ఓ సత్యనారాయణలు పూలమాల వేసి నివాళులు అర్పించారు

మానసిక ఒత్తిడి లేని విద్యను బోధించాలి

రాయచోటిటౌన్ : మానసిక ఒత్తిడి లేని విద్యను విద్యార్థులకు బోధించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం రాయచోటి పట్టణంలోని కిండర్ జాయ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వాల్మీకులకు రాజ్యాధికారం దిశగా సీఎం కృషి



వాల్మీకి కమ్యూనిటీ భవననిర్మాణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులకు రాజ్యాధికారం దిశగా ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ డ్రైవర్స్‌కాలనీ వద్ద గురువారం ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి వాల్మీకి ఆలయం, కమ్యూనిటీ భవనం, రామాయణ విజ్ఞానకేంద్రం నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం వేశారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ..వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో బీసీలకు అధిక గుర్తింపు, గౌరవం, ప్రాధాన్యత లభిస్తోందన్నారు. రాజుల దగ్గర వాల్మీకులు రాజ్యాలను కాపాడినట్లుగానే, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బోయలకు రాజ్యాధికారం కల్పించేందుకు మంత్రులుగా, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తూ, మరింత ఉన్నతస్థాయిలో ఉంచేదిశగా చర్యలు తీసుకున్నారన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ..వాల్మీకుల కమ్యూనిటీ భవన నిర్మాణ అంశాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్థలం, నిధుల కేటాయింపునకు చొరవ తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కుల,మత,ప్రాంత పార్టీలకు అతీతంగా అన్నివర్గాలను అభివృద్ధి చేసే దిశగా పాలన జరుగుతోందన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేదిశగా సీఎం వైఎస్.జగన్ కమిషన్‌ను ఏర్పాటుచేసి, అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటులో బిల్లు ఆమోదానికి కేంద్రప్రభుత్వానికి పంపారన్నారు. వాల్మీకిసంఘం నాయకులు డాక్టర్.శివకుమార్ మాట్లాడుతూ...వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై జీవితాంతం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. వాల్మీకి కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50లక్షలు నిధుల కేటాయింపులో ప్రత్యేక చొరవ చూపిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి ముందు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు వాల్మీకి,బోయలు ఘనస్వాగతం పలుకుతూ, గజమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, ఎంపీపీ రెడ్డెమ్మ, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఫోక్ అండ్ కల్చరల్ స్టేట్ డైరెక్టర్ కొండవీటినాగభూషణం, పీకేఎం-ఉడా వెంకటరెడ్డియాదవ్, జిరాక్స్ రెడ్డెప్పరెడ్డి, జబ్బలశ్రీనివాసులు, వాల్మీకిసంఘ నాయకులు దొడ్డిపల్లె ఆనంద్, రిటైర్డ్ జేసీ త్యాగరాజు, చలపతి, శివరాజ్, రాధాకృష్ణ, నరసింహులు, పాకాలహరి,శ్రీనివాసులు, మేకలవారిపల్లె చంద్ర, వెంకటేష్, బసప్ప, కేశవ, ఎం.ఎం.రమణ, మోహన, కట్టుబావిచలపతి, తెట్టుచిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యావనం..అభివృద్ధి ఘనం

- రైల్వేకోడూరు వైఎస్సార్ ఉద్యాన కళాశాలకు ప్రత్యేక స్థానం
- రూ 14.59 కోట్లతో నూతన భవనాలు
- నేడు అకడమిక్, వసతి గృహాలు ప్రారంభించనున్న మంత్రి కాకాని



ప్రారంభోత్సవనికి సిద్ధంగా ఉన్న నూతన భవన సముదాయం



నూతన అరటి వంగడాల గురించి విద్యార్థులు, రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

ఓబులవారిపల్లె: రాయలసీమలోనే ఉద్యాన పంటలకు పేరుగాంచిన రైల్వేకోడూరు అనంతరాజుపేటలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఉద్యాన కళాశాల అభివృద్ధి పథంలో దూసుకెళుతుంది. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో ఉద్యాన కళాశాలను ఏర్పాటు చేశారు. పండ్లతోటల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోంది. కళాశాల ఏర్పాటు చేసిన 15 సంవత్సరాల్లో ఎంతో పురోగతిని సాధించింది. తాజాగా శుక్రవారం కళాశాల ఆవరణలో దాదాపు 14.59 కోట్ల రూపాయలతో నిర్మించిన అకడమిక్ బ్లాక్ (ముడోదశ), బాలుర, బాలికల వసతిగృహం , పీజీ విద్యార్థుల వసతి గృహం(రెండో దశ)భవనాలతో పాటు వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పరిపాలన భవనాలను శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జఖియా ఖానం, ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వీసీ డాక్టర్ టీ జానకిరామ్ ప్రారంభించనున్నారు.

ఘన చరిత్ర కలిగిన ఉద్యాన కళాశాల

రైల్వేకోడూరు అనంతరాజుపేటలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఘనచరిత్ర కలిగి ఉంది. అప్పట్లో మద్రాస్ ప్రెసిడెన్సీ సమయంలో 1935న పండ్ల పరిశోధన స్థానం పేరిట ఏర్పాటు చేశారు. 1935 మార్చి 1న స్థలాన్ని కేటాయించారు, డాక్టర్ కేసీ నాయక్ ఈ పరిశోధన స్థానం తొలి సూపరింటెండ్‌గా ఆగస్టు 3 నుంచి బాధ్యతలు చేపట్టారు. ఆగష్టు 4 నుంచి పనిచేయడం ప్రారంభమైంది. డిసెంబర్ 12న అధికారికంగా ప్రారంభించారు. దేశంలో సబూర్ (బీహార్), కృష్ణగిరి (పశ్చిమ బెంగాల్)లతో కలిసి మామిడి పరిశోధన స్థానంగా కొనసాగింది. 1960లో దేశంలోనే 8వ పండ్ల పరిశోధన స్థానంగా ఈ సంస్థను భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐకార్) గుర్తించింది. ఉష్ణమండల పండ్ల ఉత్పత్తి పెంపు, పండ్లతోటల్లో తెగుళ్ల నివారణ ప్రధాన లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది.

125 ఎకరాల్లో ఏర్పాటు

125 ఏకరాల్లో చెన్నై-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేశారు. దక్షిణ మండల వ్యవసాయవాతవరణ స్థితిలో ఈ ప్రాంతం ఉంది. ఉద్యాన పంటల అభివృద్ధికి అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో అంకితమై పనిచేస్తోంది.బీఎస్సీ ఉద్యానకోర్సులు 2007-08లో, 2011-12 విద్యాసంవత్సరం నుంచి పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ప్రారంభమయ్యాయి. 7 విభాగాల్లో పీజీ, 5 విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తున్నారు. నిపుణులైన 8 మంది ప్రొఫెసర్లు, 9 మంది అసోసియేట్, 21 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. 11 మంది సహాయ, 36 మంది సాంకేతిక, 35 మంది ఇతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కళాశాలలో అనేక వసతులతో పాటు ఆధునిక ప్రయోగశాలలు ఉన్నాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. జేఆర్‌ఎఫ్, ఎస్ఆర్‌ఎఫ్‌లతో పాటు అనేక అంశాల్లో రాష్ట్ర , జాతీయ స్థాయి పతకాలు సాధిస్తున్నారు.

మరిన్ని వసతులు కావాలి



కళాశాల ఏర్పాటు చేసిన తక్కువ కాలంలో పురోగతి సాధించింది. ఈ ఏడాది 8 రాష్ట్రాల నుంచి విద్యార్థులు జాతీయ స్థాయిలో అడ్మిషన్ పొందారు. భవిష్యత్‌లో కళాశాలకు మరిన్ని వసతులు అవసరం. అంతర్జాతీయ విద్యార్థుల కోసం వసతి గృహం, ఏర్పాటు కావాల్సి ఉంది. ఉన్న సౌకర్యాలు మెరుగుపరచుకుంటూ మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.
- డాక్టర్ కే.గోపాల్, అసోసియేట్ డీన్, ఉద్యాన కళాశాల

గవర్నర్ పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు



ఒంటిమిట్ట: వసతి గృహం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గవర్నర్ ముందుగా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని, అనంతరం కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకుంటారన్నారు.గవర్నర్ పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు.

ఒంటిమిట్టలో ఏర్పాట్ల పరిశీలన

ఒంటిమిట్ట: రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శుక్రవారం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారిని దర్శించుకోనున్నారు. ఈనేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు. ముందుగా కలెక్టర్, ఎస్పీ స్వామి వారి దర్శించుకున్నారు. అనంతరం గవర్నర్ బసచేసే టీటీడీ వసతి గృహంలో వసతులను, ఆలయంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. గవర్నర్ వచ్చే కాన్వాయ్ రూట్ రిహార్సల్, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరిశీలించారు.

అండర్ 23 క్రికెట్ బాలుర జట్టు ఎంపిక

వాల్మీకిపురం : ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 23 క్రికెట్ బాలుర జట్టుకు జిల్లా అసోసియేషన్ వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్ క్యాంపు నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ సబ్ సెంటర్ కోచ్, బీసీసీఐ లెవల్ 1 కోచ్ సునీల్ కుమార్ తెలిపారు. వీరంతా బాయిస్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు జిల్లా ఆధ్వర్యంలో తిరుపతి వేదికగా జరిగిన ప్రాబబుల్ మ్యాచ్‌లలో పాల్గొని జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి మే 4వ తేదీ వరకు కడపలో జరిగే సౌత్‌జోన్ ఏసీఏ అండర్ 23 పురుషుల విభాగంలో వన్‌డే మ్యాచ్‌లలో పాల్గొంటారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల గురువారం అసోసియేషన్ సభ్యులు శ్రీధర్, షాహెద్, భరత్, లాల, రెడ్డి, సీనియర్ క్రీడాకారులు, క్యాంపు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

కమనీయం.. త్రిశూల చక్రస్నానం

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వాముల బ్రహ్మోత్సవాలు గురువారం త్రిశూల, చక్ర స్నానం, ధ్వజావరోహణం కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. శ్రీ వైద్యనాథేశ్వర స్వామి త్రిశూలం, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి చక్ర తాళ్వార్‌ల స్నానాలను కమనీయంగా నిర్వహించారు. పుష్పగిరి గ్రామంలోని శ్రీ వైద్యనాథస్వామి ఆలయం నుంచి కామాక్షీ సహిత వైద్యనాథ స్వామిని, త్రిశూలాన్ని, కొండపైనున్న శ్రీ లక్ష్మీచెన్నకేశవ ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామిని, చక్ర తాళ్వార్‌ను మేళ తాళాలు, డప్పువాయిద్యాలతో పల్లకీలో మోస్తూ ఊరేగింపుగా పెన్నా నది వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ భక్తులు స్వామివార్లకు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు, శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్వామి వార్ల త్రిశూలం, సుదర్శన చక్రాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నదీ జలంలోకి సమస్త తీర్థాలను ఆవాహన చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. పాలు, చందనం, నెయ్యి, పెరుగు, పసుపు, పన్నీరు, కొబ్బరి నీరుతో అభిషేకం చేశారు. అనంతరం త్రిశూల, చక్ర తాళ్వార్‌లకు తీర్థవాసి



నదిలో త్రిశూలం, చక్రాలకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

అవబృందోత్సవంను వేద మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి చక్ర స్నానాలతోపాటుగా నదిలో స్నానాలు చేశారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున కలశాలలో వుంచిన నవ ధాన్యపు మొలకలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పెన్నా నదిలో కలిపారు. రెండు ఆలయాల్లో ధ్వజ అవరోహణం చేసి, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలను ముగించారు. అనంతరం కుంభ సమారోపణ కార్యక్రమాన్ని, హోమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనుల పండువగా పుష్పయాగం

రాత్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామికి పుష్పయాగాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పూలు, వేద మంత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి నిర్వహించిన పుష్పయాగాన్ని చూసిన భక్తులు పులకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, సుబ్బయ్య స్వామి, రాజేశ్వర శర్మ, శివస్వామి, ఆలయ ఛైర్మెన్ వెంకట సుబ్బారెడ్డి, ఆర్యవైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు సుదర్శన్ రావు, సుబ్బయ్య, ఉభయదారులు పాల్గొన్నారు.

చక్రస్నాన విశిష్టత

హరి హరుల ఆయుధాలైన త్రిశూల, సుదర్శన చక్రాలకు ఒకే సారి స్నాన ఉత్సవాలు నిర్వహించడం పుష్పగిరి ప్రత్యేకత. పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే ఈ ఉత్సవంలో పాల్గొని స్నానాలాచరిస్తే చేసిన పాపాలన్నీ తొలగి పవిత్రంగా మారతారని అర్చకులు అఖిల్‌దీక్షితులు తెలిపారు. చక్ర స్నానం జరిగే సమయంలో నదిలో నీరు గలగలా కాకుండా హరి హర అనే శబ్దంతో ప్రవహిస్తూ స్నానం చేసిన వారికి ముక్కోటి తీర్థాలలో చేసిన స్నానంతో సమానమైన పుణ్యం లభిస్తుందని వేదాలు తెలుపుతున్నాయని ఆయన వివరించారు. అంతేకాక వారి జన్మ సార్థక మవుతుందని కూడా వేదాలు ఘోషిస్తున్నాయని వివరించారు.



శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుని పుష్పయాగం



ధ్వజ అవరోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

గుర్తుతెలియని యువకుడి మృతి



మదనపల్లె : గుర్తు తెలియని యువకుడు (25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. వివరాలు.. మండలంలోని పాన్నేటిపాళ్యం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెకు వెళ్లే మార్గంలో ఓ గుర్తుతెలియని యువకుడు మృతదేహం పడిఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని తాలూకా పోలీసులకు అందించారు. దీంతో తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఆధారాల కోసం వెతికారు. ఘటనపై ఆరా తీశారు. మృతుడు ఈ ప్రాంతవాసి కాదని స్థానికులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడి నోటిలో బెల్లం ముక్క ఉంది. కాగా అతిగా మద్యం సేవించి మృతి చెందాడా...? లేక ఆత్మహత్య చేసుకున్నాడా..? లేదా ఎవరైనా హత్య చేసి ఉంటారా..? అనే అంశాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. అయితే మృతుడి చొక్కా బటన్ విప్పి ఉండటం, నోటిలో బెల్లం ముక్క ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా యువకుడు శ్రీసత్యసాయి జిల్లా కొక్కంటిక్రాస్ వాసిగా ప్రాథమికంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నాటు సారా స్థావరాలపై దాడులు



నాటుసారా స్థావరాలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

వాల్మీకిపురం : మండలంలోని దిగువ మేకలవారిపల్లిలో నాటుసారా స్థావరాలపై పోలీసులు, ఎస్ఈబీ పోలీసులు కలసి గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 600 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. అనంతరం ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేయడం నేరమన్నారు. ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

కర్ణాటక ఓటర్లకు మదనపల్లెలో తాయిలాలు

- నలుగురు అరెస్ట్
- కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ కుక్కర్లు పంపిణీ

మదనపల్లె : కర్ణాటక రాష్ట్రంలో ఓటు హక్కు ఉండి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నివసిస్తున్న ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు కుక్కర్లు పంపిణీ చేస్తూ ప్రలోభ పెడుతున్న నలుగురు వ్యక్తులను బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. నిందితుల వద్ద నుంచి మూడు కర్ణాటక ఎన్నికల గుర్తింపు కార్డులు, పంపిణీ కోసం తెచ్చిన రెండు ప్రెషర్ కుక్కర్లు, మూడు కాంగ్రెస్ పార్టీ కరపత్రాలు, రూ.1850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటకకు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక ఓటర్ గుర్తింపు కార్డులు, కాంగ్రెస్ పార్టీ స్లిప్‌లు

చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. గురువారం విలేకరుల సమావేశంలో సీఐ తెలిపిన మేరకు వివరాలు... మే నెల 10వ తేదీ కర్ణాటక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, అక్కడ ఓటు హక్కు కలిగి, ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వచ్చి స్థిరపడిన ఓటర్లను బుధవారం రాత్రి కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్ఎన్ అమరనాథ్, స్థానిక వైఎస్సార్ కాలనీకి చెందిన కదిరి సీతారాం, బుస్సా రామేశ్వర్, చౌడేశ్వరీ నగర్‌కు చెందిన నాగరాజు, ఎస్.వెంకటేశ్వర్లుతో కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ నీరుగట్టువారిపల్లెలో ప్రెషర్ కుక్కర్లు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. ఈ విషయమై డీఎస్పీ కేశప్పకు రహస్య సమాచారం అందడంతో ఆయన ఆదేశాలతో టూటౌన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఓటర్లకు ప్రెషర్ కుక్కర్లు పంపిణీ చేస్తున్నట్లు అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా మే 10వ తేదీ వరకు నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మదనపల్లెలో అక్రమ మద్యం, నగదు, రవాణా, ఓటర్లను ప్రలోభ పెట్టడం, బహుమతులు అందజేయడం తదితర అంశాలపై నిఘా ఉంచామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మదనపల్లెలోని లాడ్జీల యజమానులు, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యజమానులకు ఇదివరకే సంబంధిత విషయాలపై అవగాహన కల్పించి సూచనలు అందజేసినట్లు తెలిపారు. శాంతి భద్రతల విషయానికి సంబంధించి ఎక్కడైనా అనుమానం వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, వారికి నోటీసులు అందించామన్నారు. కార్యకరమంలో టూటౌన్ ఎస్ఐ జి.చంద్రమోహన్, హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వాహనం ఢీకొని జింకకు గాయాలు



జింకకు చికిత్స చేయిస్తున్న యువకులు

ములకలచెరువు : గుర్తు తెలియని వాహనం ఢీకొని కృష్ణజింకకు తీవ్రగాయాలైన సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. అటవీశాఖ బీటు అధికారి సుధాకర్ కథనం మేరకు వివరాలు... మండలంలోని నాయనచెరువుపల్లె బస్‌స్టాప్ వద్ద జింకల మంద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒక జింకకు తీవ్రగాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ప్రయాణికులు గమనించి జింకకు ములకలచెరువు వెటర్నరీ హాస్పిటల్‌లో చికిత్స చేయించి అటవీశాఖ అధికారికి అప్పగించారు. అనంతరం జింకను దుసానవారిపల్లె సంరక్షణ శిబిరంలో వదిలిపెట్టారు.

గొర్రెలపై కుక్కల దాడి



మృతి చెందిన గొర్రె

రాయచోటి టౌన్ : గొర్రెలపై కుక్కలు దాడి చేసి, రెండింటిని చంపడంతోపాటు ఏడింటిని తీవ్రంగా గాయపరిచాయి. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి రూరల్ పరిధిలోని ఇందుకూరుపల్లెకు చెందిన గల్లా ఆదిరెడ్డెయ్య గొర్రెలు కాసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు 50కి పైగా గొర్రెలు ఉన్నాయి. గురువారం తెల్లవారుజామున ఎక్కడి నుంచో కుక్కలు మందలుగా వచ్చి గొర్రెల మందపై పడి దాడి చేసి గొంతులు కొరికేశాయి. రెండు గొర్రెలు అక్కడికక్కడే చనిపోగా, మరో 7 తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కలను అరికట్టాలని ఆయన కోరాడు.

కుక్క మొరిగిందని.. దంపతులపై దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దంపతులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల గ్రామంలో కుక్క మొరిగిందనే కారణంతో ఆగ్రహించిన ఇద్దరు యువకులు దంపతులపై కత్తులతో దాడికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మల్లెల గ్రామానికి చెందిన రవీంద్ర (60), సుజాత (45)ల పెంపుడు కుక్క వీధిలో అటుగా వెళుతున్న ఇద్దరు యువకులను చూసి మొరిగింది. అటుగా ఎవరు వెళ్లినా కుక్క మొరిగి భయ భ్రాంతులకు గురి చేస్తోందని ఆగ్రహించిన యువకులు కుక్క యజమాని రవీంద్రపై కత్తులతో దాడికి దిగారు. కత్తులతో తీవ్రంగా గాయపరుస్తున్న తన భర్తను కాపాడేందుకు భార్య వెళ్లి అడ్డుకోగా ఆమెపై కూడా దాడికి పాల్పడ్డారు. గాయపడిన దంపతులను స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. రవీంద్ర పరిస్థితి విషమంగా ఉండటంతో అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేసారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

భార్యపై భర్త దాడి

మదనపల్లె : భార్యపై భర్త దాడి చేసి గాయపరచిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె గ్రామానికి చెందిన రవి భార్య హేమలత (30) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఆమె భర్త రవి హమాలీ పనులు చేస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన రవి బుధవారం రాత్రి భార్య చెవిలోని బంగారు లాక్కెళ్లి కుదువపెట్టి అతిగా మద్యం సేవించాడు. మిగిలిన నగదు పేకాటలో పోగొట్టాడు. విషయం తెలుసుకున్న భార్య హేమలత గురువారం భర్తను నిలదీసి మందలించింది. ఈ విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. ఆవేశానికి గురైన రవి కర్రతో భార్యపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష ఫెయిల్ అయ్యానని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన గురువారం మొలకలచెరువు మండలంలో జరిగింది. దేవళచెరువు పంచాయతీ పర్తికోటకు చెందిన దేవుడప్ప కుమార్తె గీతశ్రీ (16) మదనపల్లెలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా బుధవారం సాయంత్రం విడుదలైన పరీక్షా ఫలితాల్లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యింది. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

మదనమోహనపురంలో ప్రబలిన జ్వరాలు

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలం మదనమోహనపురంలో జ్వరాలు ప్రబలినాయి. కొందరు వేలూరు, చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులో చికిత్స పొందుతున్నారు. వారికి డెంగీ సోకినట్లుగా కార్పొరేట్ వైద్య సంస్థలు గుర్తించి చికిత్స అందిస్తున్నాయి. డెంగీ జ్వరాలని చికిత్స పొందుతున్నట్లుగా బాధితవర్గాలు తెలిపాయి. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి, తక్షణమే డెంగీ జ్వరాలను కట్టడి చేయాలని మండల వైద్యసిబ్బందిని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి సృజన మాట్లాడుతూ గ్రామంలో వారం క్రితం పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. జ్వరాలు ఉన్నాయని, అవి డెంగీ జ్వరాలు కాదని, మరింతగా వైద్య సేవలందిస్తామని తెలిపారు.

108లో ప్రసవం



కలికిరి : 108 వాహనంలో సుఖ ప్రసవం జరిగిన ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు... చిన్నగొట్టిగల్లు మండలం కొత్తకాలనీకి చెందిన కుమార్, ఆయన భార్య జ్యోతి జీవనోపాధి నిమిత్తం కలికిరి నుంచి సదుం రోడ్డు ఊటుపల్లి క్రాస్ వద్ద రాతి పనులు చేస్తున్నారు. జ్యోతికి గురువారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కలికిరి 108 ఈఎంటీ యల్లమ్మ, పైలట్ గుట్టపాళెం రమణ స్థానిక ఆశా కార్యకర్తకు సమాచారమిచ్చి.. జ్యోతిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం పీలేరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు.